క్లుప్తంగా

తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ బదిలీ


సమ్మయ్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా వీటీడీఏ సెక్రెటరీగా పనిచేస్తున్న సమ్మయ్య తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై రానున్నారు.

మత్స్యకారులకు చేయూత

హత్నూర (సంగారెడ్డి): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం చేయూతనిస్తోందని మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గున్నాల నర్సింహులు అన్నారు. హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామ రైతువేదిక వద్ద రెడ్డి ఖానాపూర్, వడ్డేపల్లి, హత్నూర తదితర గ్రామాల మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సూపర్‌వైజర్ శ్రీశైలం, అధికారులు, ఆయా గ్రామాల మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

రాయికోడ్(అందోల్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ వెంకటేశంకు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం, మండల పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు మాట్లాడుతూ గతంలో 34 రోజుల పాటు సమ్మె చేసిన సందర్భంలో సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీనిస్తే సమ్మెను విరమించినట్లు గుర్తుచేశారు. అయినప్పటికీ జీపీ కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టని కారణంగా సమ్మె చేపట్టేందుకు నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు సత్తయ్య, నిరంజన్, అంజన్న, శామయ్య, సంజీవులు, నర్సింహులు, చంద్రయ్య, దత్తు, నర్సింహులు, సత్తమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

పాసుపుస్తకాలు అందజేయాలి

కోహీర్(జహీరాబాద్): పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి రైతులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శాంతకుమారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ గ్రామంలో 450 మందికి పైగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. రైతుబంధు రైతుబీమా వర్తించడంలేదన్నారు. బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ శాంతకుమారికి వినతిపత్రం సమర్పించారు.

రికార్డుల పరిశీలన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెల్టూర్ గ్రామ పంచాయతీకి వివిధ పథకాల ద్వారా మంజూరైన నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను శనివారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి నారాయణ, సర్పంచ్ లక్ష్మారెడ్డి, కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు చరణ్‌కాంత్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థిని శిల్పకు డాక్టరేట్


శిల్ప

పటాన్‌చెరు: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, రుద్రారంలోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని శిల్పా సొల్లేటిని డాక్టరేట్ వరించింది. 'మెక్రోస్ట్రక్చర్స్‌తో ద్రవాల ప్రవాహం.. థర్మోడైనమిక్ విశ్లేషణ' అంశంపై ఆమె అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించినట్లు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ వంశీకృష్ణ నార్ల తెలిపారు. శిల్పా సొల్లేటి సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడంపై గీతం విశ్వవిద్యాలయం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దత్తాత్రి నాగేష, గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మోతహర్ రెజా తదితరులు అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరిక

నారాయణఖేడ్: పెద్దశంకరంపేట మండలం కొత్తపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ విద్యా కమిటీ చైర్మన్ మల్లేశం, బీఆర్ఎస్ మాజీ గ్రామ అధ్యక్షుడు సంగారెడ్డి, నాయకులు రమేష్, గోపాల్, సాయిలు, గోపాల్‌రెడ్డి తదితరులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్, పీసీసీ సభ్యులు నివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల రోదన

- పశువుల సంతలో వసతులు కరువు
- అసంపూర్తిగా విశ్రాంతి గదులు
- నిరుపయోగంగా నీటితొట్లు
- పట్టించుకోని అధికారులు

ఒకప్పుడు పశువుల క్రయ, విక్రయాలకు అడ్డగా విరాజిల్లిన పశువుల అంగడి నేడు సమస్యలకు నిలయంగా మారింది. సంతలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పెంటకుప్పలపైనే పశువులను విక్రయిస్తున్న దుస్థితి నెలకొంది. పశువులను అమ్మగానే ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు వసతులను కల్పించడంపై శ్రద్ధ చూపడంలేదని రైతులు, వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– జహీరాబాద్ టౌన్


జహీరాబాద్ పశువుల సంత

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పశువుల సంత గతంలో ఎంతో పేరుగాంచింది. ఈ సంతకు జిల్లాతో పాటు పక్కనున్న కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి రైతులు, వ్యాపారులు వస్తుంటారు. శుక్రవారం వచ్చిందంటే చాలు వేలాది పశువుల క్రయ, విక్రయాలు జరిగేవి. ఈ సంత ద్వారా చిటీల రూపంలో మార్కెట్ కమిటీకి ప్రతి వారం రూ.50 వేల వరకు ఆదాయం వస్తుంది. కానీ.. సంతలో కనీస వసతులు లేకపోవడంతో పశువుల సంత కల తప్పింది.

పెంటకుప్పలే దిక్కు..

సంతలో వసతులు కల్పించకుండా మార్కెట్ కమిటీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు పశువుల మూగరోదనకు అద్దం పడుతోంది. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ పెంట కుప్పలపైనే సేదతీరుతున్నాయి. పశువుల దాహార్తిని తీర్చే నీటి తొట్టీలు నిరుపయోగంగా మారాయి. దూర ప్రాంతాలకు వెళ్లే పశువులను లారీలో ఎక్కించడానికి నిర్మించిన దిమ్మెలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

అసంపూర్తిగా విశ్రాంతి గదులు

రైతుల విశ్రాంతి కోసం నిర్మించిన షెడ్ల నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు, రైతులు సేద తీరడం కోసం గతంలో షెడ్ల నిర్మాణం పనులు ప్రారంభించారు. పిల్లర్ దశకు చేరుకున్న పనులు ఆ తరువాత నిలిచిపోయాయి. సంతలో నీటి సౌకర్యం లేకపోవడంతో దగ్గరలో హోటళ్లను ఆశ్రయిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సంతకు పూర్వ వైభవం తీసుకురావాలని రైతుల కోరుతున్నారు.


పిల్లర్ల దశలో విశ్రాంతి భవన నిర్మాణం

వసతుల కొరత లేదు

పశువుల సంతలో ప్రస్తుతం ఎలాంటి సమస్యలు లేవు. ప్రహరీ దెబ్బతినడంతో అకతాయిలు బోరుమోటారు స్టాటర్‌ను ధ్వంసం చేస్తున్నారు. అందుకని ప్రతి శుక్రవారం మాత్రమే బోరుమోటార్ ఆన్ చేస్తున్నాం. విశ్రాంతి గదులు. ప్రహరీ నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం.

– అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ సెక్రటరీ

పట్టించుకోవడంలేదు

జహీరాబాద్ పశువుల సంతలో సౌకర్యాలు అంతంత మాత్రమే. అంగడిలో తాగునీరు. నీడ కరువైంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు విశ్రాంతి గదులు లేవు. గతంలో ఉన్న సౌకర్యాలు ప్రస్తుతం ఒక్కటి కూడా లేవు. చిటీల రూపంలో అధిక డబ్బులు వసూలు చేస్తున్నా వసతులను కల్పించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలి.

– సత్తార్, వ్యాపారి

ఎమ్మెల్సీ కవిత కృషి అభినందనీయం


ఎమ్మెల్సీ కవితతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ, మహిళా ప్రజాప్రతినిధులు

పటాన్‌చెరు టౌన్: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శనివారం ఆమె నివాసంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి యాదమ్మ, పటాన్‌చెరు జెడ్పీటీసీ సుప్రజ, తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదంపై హర్షం

మునిపల్లి(అందోల్): పార్లమెంటులో మహిళల ప్రాధాన్యతను గుర్తించి చట్టసభల్లో చోటు కల్పించడం హర్షనీయమని జెడ్పీటీసీ మీనాక్షి అన్నారు. శనివారం స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడారు. మహిళలు రాజకీయంగా రాణించేందుకు మహిళాబిల్లు వీలును కల్పిస్తుందని తెలిపారు. మహిళా బిల్లును ఆమోదించాలని పోరాటం చేసిన ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు తెలిపారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

జహీరాబాద్ టౌన్: ఈ నెల 28న నిర్వహించే వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అధికారులకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో శనివారం సార్వజనిక కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాలను తరలించే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కరెంట్ సరఫరాకు అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, పోలీసు, రెవెన్యూ, ట్రాన్స్‌కో, వైద్యారోగ్య, పంచాయత్‌రాజ్ అధికారులు, సార్వజనిక్ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభిస్తాం

పట్టణ పరిధిలోని అప్రోచ్ రోడ్డుపై వరదనీరు నిలవకుండా కల్వర్టు నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే మాణిక్‌రావు తెలిపారు. కోహీర్ పట్టణంలో శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రోచ్ రోడ్డు కల్వర్టు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులుయాదవ్, నాయకులు విజయకుమార్, సుభాష్‌రెడ్డి, ఖాలీం, వహీద్, ఇఫ్తెకార్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో ఎమ్మెల్యే

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జనంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండప నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. మాజీ కౌన్సిలర్ రాములు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె


సదాశివపేట: తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండల కేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు టీజేఎస్ నియోజకవర్గం అధ్యక్షుడు మొగుడంపల్లి ఆశప్ప, మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్ శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమస్యలను పరిష్కరించాలి

సదాశివపేట (సంగారెడ్డి): అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెకు శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వడంతో పాటు హెల్త్ కార్డులు, ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సంగీత, లక్ష్మి ఇందిర, విజయలక్ష్మి, మహేశ్వరి, ప్రియాంక, సంగీత పాల్గొన్నారు.

13వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

హత్నూర(సంగారెడ్డి): తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారంతో 13 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేవరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం నాయకురాలు మంగ, సుజాత, మంజుల, సంగమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె ఉధృతం చేస్తాం

పటాన్‌చెరు టౌన్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు పటాన్‌చెరు శ్రామిక భవన్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా అన్ని పరిష్కారం చేశామని ఇటీవల ఐసీడీఎస్ మంత్రి మాట్లాడటం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

నారాయణఖేడ్: గణేష్ నిమజ్జనాల సందర్భంగా మంటపాలు, ఉత్సవాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంటపాల వద్ద, నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. నిమజ్జనాలు చేసే చెరువులు, కుంటల వద్దకు పిల్లలను వెంట తీసుకెళ్లరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్

సంగారెడ్డి అర్బన్: ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఫీజు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత ఐదేళ్లుగా స్కాలర్షిప్‌లు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు అతిమెల, మాణిక్యం, బాలరాజ్, రేవంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వాణి, నాయకులు శ్రీను, రజినీకాంత్, స్వప్న, మంజుల, ప్రియ, వైశాల్యం, శిరీష, శోభ, షాహిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నష్టపరిహారం చెక్కు అందజేత

హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని సికింద్రాపూర్ గ్రామంలో ఇటీవల నీరుడి మల్లయ్యకు చెందిన గేదే విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలిసిందే.. దీంతో ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.40వేల నష్టపరిహారం చెక్కును సర్పంచ్ మాణిక్యరెడ్డి శనివారం బాధిత రైతుకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొడిపల్లి యాదగిరి, నాయకుడు రవి పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి



రామచంద్రాపురం(పటాన్‌చెరు): సామాజిక సేవలో ప్రతిఒక్కరూ ముందుండాలని తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో స్టార్ ఆస్పత్రి డాక్టర్ రాహుల్ మధక్కరేతో కలిసి ఆస్పత్రి యాజమాన్యం అందించిన అంబులెన్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ సభ్యులు నరేందర్‌రెడ్డి, డాక్టర్. రాహుల్ కట్ట, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గుమ్మడిదల గ్రామ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీ శనివారం లెక్కించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.2.20లక్షలు వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన పీజీ వైద్య విద్యార్థిని గైని వైష్ణవి 3రోజుల క్రితం డెంగీతో చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కంగ్టి మాజీ ఎంపీపీ షాదుల్లా, నాయకులు అమృత్, పవన్ రాథోడ్, శ్రీకాంత్ ఉన్నారు.

మున్సిపాలిటీలో వైద్య శిబిరం

నారాయణఖేడ్: మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతహి సేవా సఫాయ్ మిత్ర సురక్ష సుబీర్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు వివిధ వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రాహుల్‌చౌహాన్, మున్సిపల్ చైర్మన్ రుబీనా నజీబ్, కౌన్సిలర్ కవితవిఠల్, శానిటరీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

సంగారెడ్డి టౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ గతంలో మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.3000 వేతనం ఇస్తామని హామీనిచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.

'అసత్య ప్రచారం మానుకోవాలి'

సదాశివపేట (సంగారెడ్డి): సంగారెడ్డి నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ మాత్రమేనని, కొందరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు కావాలని అసత్య ప్రచారం చేస్తున్నారని సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి అన్నారు. శనివారం సదాశివపేట పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.